గెస్ట్ లెక్చరర్స్‌కు దరఖాస్తులు

సిటీబ్యూరో, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ ఉన్నత అధ్యయన సంస్థ, మాసాబ్ ట్యాంక్ హైదరాబాద్‌లో బీఎడ్, ఎంఎడ్ కోర్సులకు పూర్తిగా తాత్కాలిక పద్ధతిలో గెస్ట్ లెక్చరర్లుగా బోధించేందుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మాసాబ్‌ట్యాంక్ గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీ ఇన్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ ఎ.ఉషారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిలాసఫి లెక్చరర్, సైకాలజీ లెక్చరర్, సోషియాలజీ లెక్చరర్, రీసెర్చ్ మెథడాలజీ లెక్చరర్, స్టాటిస్టిక్స్ లెక్చరర్, ఇంగ్లిష్ లెక్చరర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్, విజువల్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌లో పూర్తిగా తాత్కాలిక పద్ధతిపై బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఎంఈడీలో కనీసం 55 శాతం మార్కులు ఉండాలని, బోధన మాధ్యమం ఆంగ్లంలో ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు విద్యార్హతల జిరాక్స్ కాపీలతో ఈ నెల 21న సాయంత్రం 4.30 గంటలకు మాసాబ్‌ట్యాంక్ ఐఏఎస్‌ఈలో దరఖాస్తులు అందజేయాలని ప్రిన్సిపాల్ సూచించారు. వివరాలకు 996311 9534 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

తాను మరణిస్తూ.. మరికొందరికి ప్రాణ దానం

కాంతాబెన్ పటేల్ (ఫైల్)

మన్సూరాబాద్, ఆగస్టు 18: తాను మరణిస్తూ.. మరికొందరికి ప్రాణదానం చేసింది. ఎల్బీనగర్, శాతవాహన నగర్‌కు చెందిన కాంతాబెన్ పటేల్ (55) ఈ నెల 16న ఇంట్లో ఉండగా అకస్మాత్తుగా కింద పడి అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఎల్బీనగర్ కామినేని దవాఖానలో చేర్పించారు. ఒక రోజు ఐసీయూలో ఉంచి చికిత్స అందించినప్పటికీ ఆమె ఆరోగ్యం మెరుగుపడలేదు. ఈనెల 17న సాయంత్రం 5:28 గంటలకు కాంతాబెన్ పటేల్ బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న జీవన్ ధాన్ సంస్థ ప్రతినిధులు కాంతాబెన్ కుటుంబ సభ్యులను కలిసి అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో కుటుంబ సభ్యులు అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. కాంతాబెన్‌కు చెందిన రెండు కిడ్నీలు, లివర్‌ను దానం చేశారు.

మూసీ వెంట నిర్మాణాలను ఏం చేద్దాం?

- మూసీ రివర్ ఆక్రమణలు, నిర్మాణాలపై తలలు పట్టుకుంటున్న అధికారులు
- ఇప్పటికే 13వేలకు పైగా నిర్మాణాల గుర్తింపు
- ఎంఆర్‌డీసీఎల్‌కు క్లిష్టంగా మారనున్న భూసేకరణ ప్రక్రియ

సిటీబ్యూరో, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ): ప్రచార ఆర్భాటం మొదలు పెట్టిన మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ఇప్పుడు కొత్త సమస్యలకు తెర లేపుతోంది. మూసీ వెంట ఉన్న నిర్మాణాలను కూల్చి వేసి, జీవనదికి పునర్ వైభవం తీసుకురావడం అనుకున్నంత సులభం కాదని తెలుస్తోంది. మూసీ బఫర్ జోన్‌గా నదికి ఇరువైపులా 50 మీటర్లు ఖరారు చేసే యోచనలో ఉండగా.. ఇదే అన్ని సమస్యలకు ప్రధాన కారణం కానుంది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రణాళికలను అమలు చేయాలంటే.. ఈ బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలన్నింటిని తొలగించాల్సి వస్తోంది. ఇదే గనుక జరిగితే మూసీ రివర్ ఫ్రంట్ భూసేకరణ పూర్తి చేయడంతోనే ప్రాజెక్టుకు ఏళ్లు పట్టనుంది. లక్షన్నర కోట్లతో ఈ ప్రాజెక్టును డెవలప్ చేస్తామంటూ సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించి, ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కానీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులే ఎంఆర్‌డీసీఎల్‌కు ఎదురవుతున్నాయి.

56 కిలోమీటర్ల పొడవైన మూసీ నది ప్రక్షాళన కోసం రంగం సిద్ధం చేస్తోంది. దీనికోసం నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న నిర్మాణాలు, ప్రాపర్టీలు, ఇతర కట్టడాలను తెలుసుకునేందుకు ఎంఆర్‌డీసీఎల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో కూడిన బృందం డోర్ టూ డోర్ సర్వే చేసి... ఇప్పటివరకు 13వేలకు పైగా ప్రాపర్టీలను గుర్తించింది. ఇందులో ప్రైవేట్, పట్టా, ప్రభుత్వ భూములతోపాటు, వక్ఫ్, దేవాదాయ భూములు కూడా ఉన్నాయి. ఇందులో ప్రధానమైన పట్టా, ప్రైవేటు భూముల విషయంలో పునరావాసం, పరిహారం ఇస్తే గానీ భూములను తీసుకునే పరిస్థితి లేదు. ఇక పేదలు, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలు కూడా పెద్ద మొత్తంలో మూసీ వెంట ఉన్న ప్రభుత్వ భూముల్లో ఏండ్లుగా నివాసం ఉంటుండగా.. ఇప్పుడు వీరిని ఎక్కడికి తరలిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో ఇప్పటికే మూసీ పరివాహక ప్రాంత నివాసితులు పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధం అవుతుండగా, వీరి ఆస్తులను సేకరించడం అధికారులకు కత్తిమీద సాములా మారింది.

ఆస్తులను ఇవ్వమంటున్న నివాసితులు..

తాజాగా మూసీ వెంట సర్వే చేయడానికి వచ్చిన అధికారులతో మలక్‌పేట్ సమీపంలో ఉండే నివాసితులు వాగ్వాదానికే దిగారు. తమ భూములు, ఆస్తులను కోల్పోమని, అవసరమైతే కోర్టులను ఆశ్రయించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పరిహారం విషయం పక్కన పెడితే.. నిర్వాసితులుగా మారిపోయే అవకాశం ఉండటంతో మూసీ వెంబడి నివాసితులెవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటివరకు పూర్తయిన సర్వేలోనూ నివాసితుల్లో ఎక్కువ మంది పేద, మధ్యతరగతికి చెందినవారే ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం సర్వే కొనసాగుతున్నది. ఈ నెలాఖరు లోపు పూర్తి నివేదికను ప్రభుత్వానికి ఇవ్వనున్నట్లు ఎంఆర్‌డీసీఎల్ అధికారులు వెల్లడించారు.

ఆదర్శనగర్ డంపింగ్ యార్డును తరలించండి

- సాకేత్ -దమ్మాయిగూడ ప్రధాన రహదారిపై స్థానికుల ధర్నా

డంపింగ్‌యార్డును తరలించాలని ధర్నా చేస్తున్న కాలనీవాసులు

కాప్రా, ఆగస్టు 18: కాప్రా సాకేత్ సమీపంలోని ఆదర్శనగర్ ఖాళీస్థలంలో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డును తరలించాలని ఆ ప్రాంత స్థానికులు డిమాండ్ చేశారు. చర్మ, శ్వాస కోశ వ్యాధులకు కారణమవుతున్న డంపింగ్‌ను ఇక్కడ నుంచి ఎత్తివేయాలని నినాదాలు చేస్తూ ఆదివారం సమీప కాలనీవాసులు సాకేత్ –దమ్మాయిగూడ ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున ధర్నా చేశారు. దీంతో రహదారిపై రెండువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఆదర్శనగర్ డంపింగ్ యార్డు స్థలంలో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, సరైన పర్యవేక్షణ కొరవడి చెత్తను తరలించే చిన్న వాహనాల సిబ్బంది అనాలోచితంగా చెత్తను విచ్చలవిడిగా కుప్పలుగా పడవేస్తున్నారని, పెద్ద వాహనాల్లో తరలించేందుకు తీవ్రమైన జాప్యం జరగడంతో తీవ్రమైన దుర్గంధం వ్యాపిస్తోందన్నారు. దీని ద్వారా ప్రాణాంతకమైన చర్మ, శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు ఆరోపించారు. జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సబ్ ఇన్‌స్పెక్టర్ వేణుమాధవ్ ఘటనా స్థలానికి చేరుకొని వారితో మాట్లాడి, సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలుగనీయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదర్శనగర్, వైష్ణవి ఎన్‌క్లేవ్, మారుతీ ఎన్‌క్లేవ్, సాయిరాంనగర్, సాయిబాబానగర్ కాలనీవాసులు, సీసీఎస్ ప్రతినిధి పద్మారెడ్డి, కొండల్‌గౌడ్, యాదగిరి, కృష్ణ, నరేందర్ రెడ్డి, నరేశ్, మహిళలు పాల్గొన్నారు.

మైల్స్ ఆఫ్ స్మైల్స్ పుస్తకావిష్కరణ

ప్రముఖ డెంటల్ సర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎస్ గౌడ్ రచించిన 'మైల్స్ ఆఫ్ స్మైల్స్' పుస్తకాన్ని ఆదివారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే టాప్ వంద మందిలో ఉత్తమ దంత వైద్యుడిగా పేరు తెచ్చుకున్న ఎంఎస్ గౌడ్ ఈ పుస్తకాన్ని రచించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

- సిటీబ్యూరో, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ)

ఆర్ట్ గ్యాలరీలో ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన

కొండాపూర్, ఆగస్టు 18 : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో హైదరాబాద్ సెంటర్ ఫర్ ఫొటోగ్రఫీ, తెలంగాణ రాష్ట్ర టూరిజం విభాగంతో కలిసి ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి టూరిజం, కల్చరల్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ప్రదర్శనలో చిత్రాలను తిలకించి, వాటి విశేషాలను ఫొటోగ్రాఫర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రదర్శనలో ఉంచిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని, గడిచిన కాలాన్ని కళ్లముందు ఉంచినట్లు చిత్రాలున్నాయని తెలిపారు. ప్రదర్శనలో 42 చిత్రాలను ఈ నెల 25 వరకు ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కే లక్ష్మి, ఐపీఎఫ్ అక్విన్ మాథ్యు, విశ్వేందర్ రెడ్డి, సత్య ప్రసాద్, డాక్టర్ రవి కుమార్ పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

చిక్కడపల్లి, ఆగస్టు 18:పిల్లల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జనగణమన జయకేతనం 'దేశభక్తి గీతాలకు– నృత్య నీరాజనం' సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై మాట్లాడారు. పిల్లల్లో ప్రతిభను గుర్తించడానికి, వారిలో దేశ భక్తిని పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న బాలోత్సవం కమిటీకి ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని తెలిపారు. పిల్లలలో దేశ భక్తిని పెంపొందించడానికే ఈ కార్యక్రమం నిర్వహించామని బాలోత్సవం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు వినయ్‌కుమార్, ఇందిరా పరుశురాం, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న నేటి తరానికి ఆదర్శం

సిటీబ్యూరో, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ) : పేద, బడుగు, బలహీన వర్గాల సమానత్వం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బడుగులను ఐక్యం చేసుకొని ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసి గోల్కొండ కోటను జయించిన సర్దార్ సర్వాయి పాపన్న నేటి తరానికి ఆదర్శమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.ఆశన్న, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి యాదయ్య, జిల్లా వికలాంగుల అభివృద్ధి అధికారి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మంగళ కలెక్షన్‌ను విడుదల చేసిన టీబీజెడ్

పంజాగుట్టలోని ది ఒరిజినల్ స్టోర్‌లో టీబీజెడ్ సంస్థ ప్రత్యేకంగా తయారు చేసిన మంగళ కలెక్షన్‌ను ఆవిష్కరించి ప్రదర్శిస్తున్న నటి సంయుక్త మీనన్

సిటీబ్యూరో, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): శ్రావణ మాసం వరలక్ష్మి వ్రతం శుభ సందర్భంగా టీబీజెడ్ సంస్థ ప్రత్యేకంగా మంగళ కలెక్షన్‌ను ఆవిష్కరించింది. ప్రముఖ నటి సంయుక్త మీనన్ పంజాగుట్టలోని ది ఒరిజినల్ స్టోర్‌లో ఆదివారం ప్రారంభించింది. దక్షిణ భారతదేశంలోని మహోన్నత సాంస్కృతిక వైభవానికి గుర్తుగా ఈ కలెక్షన్‌లు ఉంటాయని సంయుక్త మీనన్ తెలిపారు. మంగళ కలెక్షన్‌లోని ప్రతి అభరణం భారతీయ సంప్రదాయాలకు అనుగుణంగా, ఆకట్టుకునేలా ఉన్నాయని, విభిన్న డిజైన్‌లతో కూడిన వజ్రాభరణాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. టీబీజెడ్ సరైన ఎంపికతో పాటు సరసమైన ధర కలిగిన ఉత్పత్తులను వినియోగదారులకు విక్రయిస్తుందని తెలిపారు.

జీహెచ్ఎంసీలో కిస్సా కుర్చీ కా..!!

- బదిలీలు చేసినా బల్దియాను వీడని అధికారులు
- డిప్యూటీ కమిషనర్ల నుంచి సీనియర్ ఎంటమాలజీ దాకా ఇదే తంతు
- నెల రోజులు దాటినా జీహెచ్ఎంసీలోనే తిష్ట
- వీరి వ్యవహారంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి దక్కని పోస్టింగ్
- చర్చనీయాంశమైన కొందరు అధికారుల తీరు

సిటీబ్యూరో, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో కొందరికి ప్రభుత్వ ఆదేశాలు అంటే లెక్కలేదు. మేం ఇష్ట మొచ్చినప్పుడు వస్తాం..మాకు నచ్చనప్పుడు బల్దియాను వీడుతాం. ఈ విషయంలో రూల్స్ గీల్స్ జాన్తా నహీ.. అంటూ కమిషనర్ నుంచి విధిగా ఉద్యోగ నిర్వహణ చేసే తోటి ఉద్యోగుల వరకు సవాల్ విసురుతున్నారు. ఇప్పటికే పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఉత్తర్వులకు విరుద్ధంగా డిప్యూటీ కమిషనర్లు ట్రాన్స్‌ఫర్ అయినా బల్దియాను వీడటం లేదు. తాజాగా ఈ బాటలోనే జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగంలో సీనియర్ ఎంటమాలజిస్ట్ విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు అధికారులు జీహెచ్ఎంసీ నుంచి రిలీవ్ కాలేదు. సీనియర్ ఎంటమాలజిస్ట్ రజనీని వరంగల్ డీఎం అండ్ హెచ్‌ఓగా , మరొకరు ఎన్ శ్రీనివాసులు ఉస్మానియా మెడికల్ కాలేజీకి బదిలీ అయ్యారు. గత నెల 18న వీరిని బదిలీ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ బి.రవీందర్ నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఇద్దరు అధికారులు బదిలీ అయి నెల రోజులు గడిచినా ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్నారు. కమిషనర్ చొరవ తీసుకుని బదిలీ అయిన వారి పట్ల నిర్ణయం తీసుకొని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి పోస్టింగ్ ఇవ్వాలని కోరుతున్నారు.

పాపన్నగౌడ్ జీవితం ఆదర్శం

- పాపన్నగౌడ్ పుట్టిన ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం
- అభివృద్ధికి 4.70 కోట్లు మంజూరు
- పాపన్నగౌడ్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ప్రతి గ్రామానికి పంపించాలి
- డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తదితరులు

రవీంద్రభారతి, ఆగస్టు 18: రాజ్యాన్ని అధిష్టించాలి, పాలించాలి..బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం ఇవ్వాలని చేసి చూపించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం ప్రజలందరికీ ఆదర్శమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో బీసీ సంక్షేమ శాఖ, తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అధ్యక్షతన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, బీసీ కమిషన్ చైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ విచ్చేసి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ పాపన్న గౌడ్ పుట్టిన ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు 4.70 కోట్లు మంజూరు చేశామన్నారు.పాపన్న జీవిత చరిత్రపై రూపొందించిన పాకెట్ బుక్కును ప్రతి గ్రామానికి పంపించాలన్నారు. ప్రభుత్వం ఇందుకు అవసరమైన నిధులు కేటాయిస్తుందన్నారు. సైనికులను బంధిస్తే ఎన్ని ఇబ్బందులు వచ్చినా తలవంచకుండా స్నేహితులను సైనికులుగా మార్చి గోల్కొండ, భువనగిరి కోటలను పాపన్నగౌడ్ జయించారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అంటే ఆనాడు గోల్కొండ కోట కొట్టిన పులిబిడ్డ అని అన్నారు. త్వరలో ట్యాంక్‌బండ్‌పై పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో కులగణన చేపట్టామని , కులగణన జరిగిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామన్నారు. గీత కార్మికులకు మొదటి దశలో 10వేల మందికి సేఫ్టీ మోకులను అందజేస్తామని చెప్పారు. సర్వాయి పాపన్నగౌడ్‌ను ఈ తరం యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం, నారాయణగౌడ్, బీసీ కమిషన్ మెంబర్ కె.కిశోర్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మహిళా కమిషన్ చైర్మన్ శారద, హస్తకళల చైర్మన్ సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

ఉస్మానియా ఓపీ బ్లాక్‌లో కూలిన మొదటి అంతస్తు బాల్కనీ రేయిలింగ్

- ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రమాదం
- ఈ ఘటనలో మూడు ద్విచక్ర వాహనాలు ధ్వంసం

ఉస్మానియా దవాఖాన ఓపీ బ్లాక్‌లోని పార్కింగ్ ఏరియాలో కుప్పకూలిన రేయిలింగ్

సుల్తాన్‌బజార్,ఆగస్టు 18 : పేదల ధర్మాసుపత్రిగా పేరుగాంచిన ఉస్మానియా దవాఖానలోని ఓపీ భవనంలో ఏదో ఒక చోట తరుచూ పైకప్పు(సీలింగ్)పెచ్చులూడి పడుతుండటంతో దవాఖాన వైద్యులు, వైద్య సిబ్బందితో పాటు చికిత్స పొందుతున్న రోగులు, రోగి సహాయకులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో దవాఖానలోని ఓపీ భవనం మొదటి అంతస్తులోని బాల్కనీ రేయిలింగ్ హఠాత్తుగా శబ్దం చేస్తూ కుప్ప కూలింది. అదృష్టవశాత్తు రేయిలింగ్ కూలిన ప్రాంతం పార్కింగ్ స్థలం. ఆ స్థలంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా ఈ ఘటనలో మూడు ద్విచక్ర వాహనాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. గతంలోనూ ఇటువంటి ఘటనలు చోటు చేసుకున్నా రాష్ట్ర ప్రభుత్వం కానీ వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇలాంటి ఘటనలు నిత్యకృత్యమై రోగులు, వైద్య సిబ్బంది వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. సుమారు 5 దశాబ్దాల క్రితం నిర్మించిన ఓపీ భవనం పటిష్టతపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. ఉస్మానియా పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి, మూతపడటంతో గత నాలుగేళ్లుగా ఓపీ, కులీకుతుబ్‌షా భవనాల్లోనే రోగులకు చికిత్సలు అందుతున్నాయి. 50 ఏండ్లు దాటిన భవనంలోని గోడలు బీటలు వారి వర్షం కురిసిన ప్రతిసారి గోడల్లో పటుత్వం కోల్పోతుందని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. ఈ వరుస ఘటనలతో ఓపీ బ్లాక్‌లో విధులు నిర్వర్తించాలంటే వైద్యులు, వైద్య సిబ్బంది ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విధులను నిర్వహిస్తున్నారంటే అతిశయోక్తి లేదు. గతంలో పాత భవనం ప్రస్తుతం ఓపీ భవనంలో విధులు నిర్వహిస్తున్న తాము ప్రమాదకర పరిస్థితుల్లో రోగులకు వైద్య సేవలు అందించాల్సిన దుస్థితి నెలకొందని పలువురు వైద్య సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఈ విషయంపై స్పందించి తక్షణమే నిపుణులైన ఇంజినీర్ల బృందంతో ఓపీ భవనం పటిష్టత పై సమగ్ర అధ్యయనం జరిపించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

గంగమ్మతల్లికి తెప్పోత్సవం

521 బోనాలతో భారీ ప్రదర్శన | వేలాదిగా హాజరైన గంగపుత్రులు

గంగ తెప్పోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ఖైరతాబాద్, ఆగస్టు 18 : గంగమ్మ తల్లికి తెప్పోత్సవ క్రతువు నేత్ర పర్వంగా సాగింది. తెలంగాణ గంగ తెప్పోత్సవ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గంగపుత్రులు తమ సంప్రదాయాన్ని చాటుతూ జల పందిరితో నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకున్నది. తొలుత ఖైరతాబాద్‌లోని ఏడుగుళ్ల వద్ద 521 బోనాలతో మహిళలు భారీ ఊరేగింపు నిర్వహించగా, తెలంగాణ కళారూపాలైన ఒగ్గుడోలు, గుస్సాడి, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. జోగిని అవిక, రాకేశ్ బోనం విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ప్రదర్శన సాగర్ వద్దగల గంగమ్మ దేవాలయం వరకు కొనసాగింది. ఈ వేడుకలకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, ముఠా గోపాల్, దానం నాగేందర్, ఎంపీ అనీల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ వి.హన్మంతరావు, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, తెలంగాణ మత్స్య సహకార సొసైటీ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్‌పర్సన్ కొప్పు పద్మ, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రమణ్ గౌడ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య కిషన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ... మత్స్య వృత్తినే జీవనాధారంగా చేసుకున్న గంగపుత్రులకు గంగమ్మ తల్లి చల్లని దీవెనలు, ఆశీస్సులు అందించాలని ఆకాంక్షించారు. తెలంగాణ గంగా తెప్పోత్సవ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మల్కు మహేందర్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గంగా తెప్పోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని, రాష్ట్ర పండుగగా గుర్తించాలన్నారు. గంగపుత్రులను గుర్తించి అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించాలని, చెరువులపై హక్కులు గంగపుత్రులకే ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి పూస నర్సింహ, కార్యనిర్వాహక అధ్యక్షుడు మంగళపల్లి రాజు, ఉపాధ్యక్షులు జగదీశ్ బాబు, అదనపు ప్రధాన కార్యదర్శి బైరు బాబురావు, కోశాధికారి కాపరనేని లింగం, సహాయ కోశాధికారి మామిడి సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న గంగపుత్ర మహిళలు

వృత్తి చిహ్నమైన జలపందిరితో ఊరేగింపు నిర్వహిస్తున్న గంగపుత్రులు